క్లుప్తంగా

దరఖాస్తులకు గడువు పెంపు

కాసిపేట: తెలంగాణ మోడల్‌స్కూల్‌లో దరఖాస్తులకు గడువును మార్చి 1 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. 6వ తరగతిలో పూర్తి స్థాయి ప్రవేశాలు 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలి ఉన్న అడ్మిషన్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో అన్ని వసతులతో విద్యను అందించే మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

'ఆదివాసీ నాయకుల అరెస్టు సరికాదు'

దండేపల్లి: మంత్రి హరీష్‌రావు బోథ్ పర్యటన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదని, ఆదివాసీ సేనా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కోట్నాక తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టులను ఖండిస్తున్నట్లు తెలిపారు. అరెస్టులతో తమ ఉద్యమాలను ఎవరూ ఆపలేరన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు రాష్ట్రాల వేషధారణలతో పాటు వంటకాలను ప్రదర్శించారు. 300మంది విద్యార్థులు 300కు పైగా వెరైటీలతో వంటకాల ప్రదర్శనలు చేపట్టిన తీరు ఆలోచింపజేసింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పాఠశాల డీన్ గజానంద్, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై మ్యాజిక్ షో

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామ వివేకానంద పాఠశాలలో మూఢనమ్మకాలపై నిర్మల్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ చేసిన మ్యాజిక్ షో అలరించింది. మాయ, మంత్రాలు, మూఢ నమ్మకాలు, దయ్యాలు, భూతాలు, లాంటివి నమ్మవద్దని, కొందరు చేసే మాయలు అబద్ధమని తెలిపారు. పలు మ్యాజిక్‌ల ద్వారా మూఢ నమ్మకాలను నమ్మవద్దని తెలియజేశారు. ఇస్మాయిల్ చేసిన మ్యాజిక్ అలరించింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సతీశ్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో గల 16వార్డులో రూ.14కోట్ల నిధులతో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో సిమెంట్ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ తుమ్మ రమేశ్, ఏఈ సాయికిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి'

పాతమంచిర్యాల: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్ట్ ఆల్ హామలీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల రైల్వేస్టేషన్ మేనేజర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ..ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, ఓపీస్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షులు సంపత్, నాగరాజు, ప్రసాద్, స్వరూప, కుమార్ పాల్గొన్నారు.

'బీజేపీ గద్దె కూల్చివేతపై ఫిర్యాదు'

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాలలో బీజేపీ గద్దెను కూల్చివేశారని బీజేపీ మండలాధ్యక్షుడు బాపు బుధవారం చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని జువ్వి చెట్టు ప్రాంతంలో పార్టీ కార్యకర్త అయిన జిమ్మిడి వెంకటరాజంకు సంబంధించిన పట్టా భూమిలో బీజేపీ గద్దెను నిర్మించినట్లు, స్థానిక ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు కలిసి పథకం ప్రకారం గద్దెను కూలగొట్టారని పేర్కొన్నాడు. వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు బుధవారం ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గొర్రెల మేకల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

సకాలంలో మందులు తెప్పించాలి

దండేపల్లి: గొర్రెలు, మేకలకు అందించే మందులను సకాలంలో తెప్పించాలని, దండేపల్లి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నట్టల నివారణ మందులు ఆలస్యంగా రావడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దండేపల్లిలో బుధవారం నిర్వహించిన నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని సంఘ నాయకులు బహిష్కరించారు.



కాల్‌టెక్స్‌లో అలంకారప్రాయంగా ఉన్న దుకాణాల షెడ్లు

మాకొద్దీ షెడ్లు!

- మున్సిపల్ దుకాణాలపై వ్యాపారుల అనాసక్తి
- జనావాసాలకు దూరంగా ఉండడం, అద్దె నిర్ణయించకపోవడమే కారణం
- అవగాహన కల్పించని అధికారులు
- రోడ్లపైనే కొనసాగుతున్న చిరు వ్యాపారాలు

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో నిర్మించిన దుకాణాల షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. రోడ్డు విస్తరణలో నిరాశ్రయులైన వీధి వ్యాపారుల కోసం వీటిని నిర్మించగా సరైన చిత్తశుద్ధి లేక నిర్లక్ష్యం చేస్తున్నారు. దుకాణాల షెడ్లు అద్దెకు ఇచ్చి వారికి ఉపాధి మార్గాలను చూపాలనే లక్ష్యంతో చేపట్టిన షెడ్లు అలంకారప్రాయంగా ఉండిపోతున్నాయి. జనావాసాలకు దూరంగా ఉండడంతో వీటిని అద్దెకు తీసుకోవడానికి వీధి వ్యాపారులు అయిష్టత చూపుతుండగా మున్సిపల్ అధికారులు కూడా అంతే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ ప్రజాప్రతినిధుల్లో నిర్లిప్తత ఆవరించి అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడంలో శ్రద్ధ కూడా చూపలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

వేర్వేరు ప్రాంతాల్లో షెడ్లు..

మున్సిపాలిటీలో రెండు చోట్ల వేర్వేరుగా దుకాణాల షెడ్లను నిర్మించారు. కాంటా చౌరస్తా నుంచి ఏఎంసీ ఏరియాకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని ఆనుకుని రూ.9.20లక్షల వ్యయంతో రెండు షెడ్లను, కాల్‌టెక్స్ ఏరియా రైల్వే అండర్ బ్రిడ్జి క్రింద రూ.4.70లక్షలతో మరో రెండు దుకాణాల షెడ్లను నిర్మించారు. షెడ్లు నిర్మించి ఏడాది గడిచినా ఇంత వరకు వీధి వ్యాపారులకు అద్దె ప్రాతిపదికన కట్టబెట్టలేదు. ఆ దిశగా చర్యలు కూడా తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్తక, వ్యాపారం సాగించిన వ్యాపారులు, మారుబేరం వ్యాపారులు సరైన చోటు లేక మున్సిపాలిటీలోని పలుచోట్ల రోడ్ల పక్కన, పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట చెట్ల నీడ కింద, కాంటా చౌరస్తా, బెల్లంపల్లి బస్తీకి వెళ్లే మార్గంలో ఇతర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై గంపలు పెట్టుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి దుకాణాల షెడ్లను నిర్మిస్తే భవిష్యత్‌లో ఉపయోగపడతాయా లేదా అనే కనీస అవగాహన లేకుండా నిర్మించినట్లు పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. అనాలోచితంగా వ్యవహరించి అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి వ్యాపారులకు సరైన అవగాహన కల్పించి షెడ్లను అద్దెకు ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

షెడ్‌లో అమ్మకాలు చేసుకోవాలని చెప్పారు



కొత్తగా మార్కెట్ నిర్మాణం ప్రారంభించడంతో ఇంతవరకు రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై తాత్కాలికంగా అమ్మకాలు సాగిస్తూ వచ్చాం. షెడ్లు నిర్మాణం పూర్తైనా నెలల తరబడి ఖాళీగానే ఉండిపోయాయి. కానీ ఇటీవలనే మున్సిపల్ అధికారులు షెడ్లలో వ్యాపారం చేసుకోవాలని సూచించడంతో ఫుట్‌పాత్ నుంచి దుకాణాన్ని వదిలేసి కొంతమందిమి మాత్రమే షెడ్‌లోకి దుకాణం మార్చాం. కిరాయి ఎంత అనేది కూడా చెప్పలేదు.

\- ఎండి.బాబా, చిరు చేపల వ్యాపారి

దరఖాస్తు చేసుకోలేదు



షెడ్‌ల నిర్మాణాలు పూర్తయినా మున్సిపల్ అధికారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించలేదు. ఫుట్‌పాత్‌పై చేపల అమ్మకాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని షెడ్‌లోకి మారాలని ఆదేశించా రు. ఆ ప్రకారంగానే షెడ్‌లోకి వెళ్లాం. కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్‌లో దుకాణాలను కేటాయిస్తే అక్కడనే వ్యాపారం చేసుకుంటాం. షెడ్ల కోసం మాకేమీ అవగాహన కల్పించలేదు.

\- మహేందర్, చిరు చేపల వ్యాపారి

త్వరలోనే అద్దెకు ఇస్తాం..

వీధి వ్యాపారం సాగించడం కోసం రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారుల కోసం షెడ్లు నిర్మించాం. వీటిని అద్దెకు ఇవ్వడానికి విధి విధానాలను తయారు చేస్తున్నాం. ఈ పాటికే కొంతమంది వీధి వ్యాపారులకు అవగాహన కల్పించి వ్యాపారం చేసుకోవాల్సిందిగా సూచించాం. కానీ కొందరు సానుకూలంగా స్పందించడం లేదు. వీలైనంత త్వరగా దుకాణాల షెడ్లను వీధి వ్యాపారులకు అప్పగించే చర్యలు తీసుకుంటాం.

\- ఆకుల వెంకటేష్, మున్సిపల్ కమిషనర్

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రజలకు కంటి సమస్యలు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకుని, కంటి పరీక్షలు చేసుకోవాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డు, 18వ వార్డులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కంటి పరీక్షల నిర్వహణ, కంటి సమస్యలు ఉన్నవారికి అందిస్తున్న కంటి అద్దాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, 4వ వార్డు కౌన్సిలర్ మోతె సుజాత, 18వ వార్డు కౌన్సిలర్ హఫీజా బేగం, నాయకులు ఖాజామియా, తాజుద్దిన్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమిపూజ చేశారు. రూ.20లక్షల పంచాయతీ రాజ్ నిధులతో నిర్మిస్తున్నట్లు, రానున్న రోజుల్లో కొత్త పంచాయతీలతో పాటు శిథిలంగా ఉన్న భవనాల స్థానంలో నూతన భవనాల ఏర్పాటు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ భూమేశ్, ఎంపీపీ స్వర్ణలత, రైతు సమితీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

అభివృద్ధే ధ్యేయం

మంచిర్యాలటౌన్: నియోజకవర్గ అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. పాతమంచిర్యాలలో రూ.1.60 కోట్లతో టీయూఎఫ్ఐడీసీ, జనరల్ ఫండ్ నిధులతో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే పలువురు ప్రతిపక్ష నాయకులు, ఆయా పార్టీల కార్యకర్తలు తనపై తప్పుడు ప్రచారం చేస్తునానరని విమర్శించారు. చీరలు ఇచ్చి ఓట్లు దండుకుందామనుకునేవారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కౌన్సిలర్లు మాదంశెట్టి సత్యనారాయణ, బొలిశెట్టి సునీత, మేరుగు మహేశ్వరి, అంకం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

వేమనపల్లి: అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేసే చర్యలు తప్పవని జెడ్పీ సీఈవో కాకిరాల నరేందర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ, పంచాయతీరాజ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనులకు ఎక్కువ మంది కూలీలు వెళ్లేలా చూడాలని సూచించారు. నర్సరీ, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఉపాధిహామీ, గ్రామపంచాయతీ రికార్డులు అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ సీఈవో నరేందర్

'కిషన్‌రావుకు సంబంధం లేదు'

పాతమంచిర్యాల: ఆరె కుల సంక్షేమ సంఘంతో లింగంపల్లి కిషన్‌రావుకు ఎలాంటి సంబంధం లేదని, ఈ నెల 24న హైదరాబాద్‌లో ఆయన ఏర్పాటు చేస్తున్న సమావేశానికి ఆరె కులస్తులు హాజరు కావద్దని ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చాప్లె రావూజీ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఆరె కుల సంక్షేమ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంఘం కిషన్‌రావు చర్యలను సమర్థిస్తే హైదరాబాద్‌లో మన సంఘం కోసం ప్రభుత్వం ఇచ్చిన ఎకరం భూమి చేజారిపోయే ప్రమాదముందన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను దూషించడం, కుల సంఘం నాయకులను దుర్భాషలాడడం, ఓబీసీ సమస్యలను తప్పుదారి పట్టించడం, రాష్ట్ర కమిటీకి సమాచారం లేకుండా వ్యక్తిగత ఎజెండాతో సమావేశాలు నిర్వహించడంతో కిషన్‌రావును గతంలోనే స్టీరింగ్ కమిటీ చైర్మన్ పదవీ నుంచి తొలగించామన్నారు. చెట్టుపల్లి శివాజీ నేతృత్వంలో తిరిగి స్టీరింగ్ కమిటీ నూతన చైర్మన్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు చాప్లె రావూజీ

రోహిణి కమిషన్‌కు కాలపరిమితి విధించాలి

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల పెంపు, ఏబీసీడీ గ్రూప్‌లుగా వర్గీకరణకు క్షేత్రస్థాయిలో పర్యటనకై 2017లో ఏర్పాటు చేసిన ఓబీసీ రోహిణి కమిషన్‌కు నిర్ణీత కాలపరిమితి విధించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2017లో రోహిణి కమిషన్‌ను వర్గీకరణకు ఏర్పాటు చేయగా ఆరు సంవత్సరాలైన ఈ కమిషన్ ఏ నివేదికను ఇవ్వలేదని, ఇప్పటికీ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రోహిణి కమిషన్‌పై కాలపరిమితి విధించి బీసీల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు వంగల దయానంద్, జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, నాయకులు మాదన బోయిన రాజన్న, సంతోష్, కన్నయ్య పాల్గొన్నారు.

ఆరెపల్లిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

భీమారం: మండలంలోని ఆరెపల్లిలోని 263సర్వే నెంబర్‌లో ఆక్రమణకు గురైన ఎకరం ప్రభుత్వ భూమిని బుధవారం రెవెన్యూఅధికారులు స్వాధీన పర్చుకున్నారు. గ్రామ సమీపంలో ఎకరం భూమిని ఉస్కమల్ల రమేశ్ అనే వ్యక్తి ఆక్రమించాడని తెలుసుకొని, తాము గ్రామానికి వెళ్లినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అరుణ తెలిపారు. ఆక్రమణకు గురైన భూమి వద్ద సర్వేయర్‌తో సహా వెళ్లి సర్వే చేస్తుండగా రమేశ్ వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. ఆ భూమికి సంబంధించి ఎలాంటి పత్రాలు అతడి వద్ద లేకపోవడంతో భూమిని స్వాధీన పర్చుకున్నామన్నారు. ఈ భూమిని గ్రామీణా క్రీడా ప్రాంగణానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీని ఆదరించండి

మందమర్రిరూరల్: ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న బీజేపీని ప్రజలు ఆదరించాలని మాజీమంత్రి, బీజేపీ నాయకులు విజయరామారాజు పేర్కొన్నారు. ప్రాణిహిత కాలనీ (షిర్కే)లో బుధవారం ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, కేసీఆర్ ఒక్కడే పదవి అనుభవిస్తూ తెలంగాణను దోచుకుంటుంటున్నారనిఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు అక్కల రమేష్, శ్రీనివాస్, నరేష్, దుర్గరాజ్, సురేందర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

'బీఆర్ఎస్ ప్రచారం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

దండేపల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం బాల్య వివాహాలపై సర్పంచ్ చంద్రకళ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆలయానికి రూ.50వేలు వితరణ

మందమర్రిరూరల్: పట్టణంలోని బురదగూడెం సమీపంలోని మహంకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో నిర్మించే యాగశాల కోసం రెండో జోన్‌కు చెందిన దాసరి రాములు–దేవేంద్ర దంపతులు బుధవారం ఆలయ నిర్వాహకులకు రూ.50వేలు వితరణ అందించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ లక్ష్మణ్ బుధవారం ప్రారంభించారు.

'ఈతవనం నాశనం చేయొద్దు'

జన్నారం: కరెంట్ లైన్ ఈతవనం నుంచి వేసి మా ఈతవనం నాశనం చేయొద్దని మండలంలోని కిష్టాపూర్, చర్లపల్లి గీతకార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎక్సైజ్, విద్యుత్ అధికారులు చొరవ తీసుకుని విద్యుత్ లైన్ వేరే చోట నుంచి వేసుకోవాలని కోరారు.

'ఇతరులకు అనుమతి లేదు'

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు, అయ్యవారికుంట, కొత్త చెరువుల్లో ఫిషర్‌మాన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తప్పా, ఇతరులు చేపలు పట్టేందుకు అనుమతి లేదని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మాదరబోయిన శ్రీనివాస్ తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తాండూర్: తాండూర్ ఐబీ కేంద్రం మాదారం పోలీసు స్టేషన్ క్రీడామైదానంలో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. కన్నం మనోహర్ (మణి)స్మారకార్థం శ్రీ గణేష్ మండలి, స్నేహితుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను తాండూర్ సీఐ జగదీష్ ప్రారంభించారు.

'ఎన్నికల హామీని విస్మరించిన కేసీఆర్'

మందమర్రిరూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని టీపీసీసీ మెంబర్ నూకల రమేశ్ ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం క్యాతనపల్లిలోని సుభాష్‌నగర్‌లో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థికి సన్మానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆసరెల్లి రవి కిరణ్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నందునా బుధవారం కళాశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు.

పంటలపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నంనూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో సంధ్య ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగు నిర్వహణ, క్రయ, విక్రయాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.

కార్మికుల అక్రమ డిస్మిస్‌లు రద్దు చేయాలి

బెల్లంపల్లి: భూపాలపల్లి ఏరియాలో కార్మికులను అక్రమంగా డిస్మిస్ చేశారని వెంటనే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శాంతిఖని గనిపై బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో జేఏసీ నాయకులు పాల్గొని మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా అనారోగ్యం బారినపడ్డ కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడంలేదనే నెపంతో ఒకే నెలలో 47మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగించారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. డ్యూటీ చేయని సమయానికి జీతం చెల్లించడం లేనప్పుడు అక్రమంగా డిస్మస్ చేయరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా, సింగరేణి యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరించడం దారుణమన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే డిస్మిసల్ ఉత్తర్వులను రద్దు చేసుకుని యథావిధిగా కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎండి.చాంద్‌పాషా, టీ.మణిరాంసింగ్, ఓజియార్, దేవి సత్యం, జైపాల్‌సింగ్, మహేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

జీఎం కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

శ్రీరాంపూర్: ఖాళీ ఉన్న కంపెనీ క్వార్టర్లను తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ కంపెనీ వ్యాప్తంగా సుమారు 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బొగ్గు ఉత్పత్తిలో కూడా తామెంతో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. కంపెనీలో చాలా క్వార్టర్లు పర్మినెంట్ కార్మికులు తీసుకోవడానికి ఇష్టపడక ఖాళీగా ఉంటున్నాయని, వాటిని తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీని వల్ల అవి అన్యాక్రాంతం కాకుండా కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కుమారి, గట్టు మహేందర్, నాయకులు సంపత్, కళా సరోజన, సమ్మయ్య, సతీశ్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

బొగ్గుబాయి వార్తలు

విద్యార్థి దశలోనే సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: విద్యార్థి దశ నుంచే దేశభక్తి, సేవాభావం అలవర్చుకోవాలని ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. స్కౌట్‌ండ్ గైడ్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో వరల్డ్ థింకింగ్ డే ను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా బెడెన్ పావెల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్, పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు, స్కౌట్ మాస్టర్లు శక్తికుమార్, గైడ్ మాస్టర్ కల్పలత, అధ్యాపక బృందం, స్కౌట్ విద్యార్థులు ఉన్నారు.

రామారావుపేటలో ఉచిత వైద్యశిబిరం

జైపూర్: శ్రీరాంపూర్ ఓసీపీ ప్రభావిత గ్రామమైన జైపూర్ మండలం రామారావుపేట, సింగాపూర్, దుబ్బపల్లి గ్రామాల ప్రజల సౌకర్యార్థం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించగా, సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ బాపు ప్రారంభించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డిని కోరగా స్పందించినట్లు తెలిపారు. డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

భగీరథ నీళ్లు.. రోడ్డుపాలు..!

దండేపల్లి: మండలంలోని పెద్దపేటలో భగీరథ ట్యాంకు నుంచి నీరు లీకై నీరంతా రోడ్డుపై పారుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి భగీ రథ నీళ్లు రోడ్డుపైకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



అవిశ్వాసం..ఉత్తదాయే!

- క్యాంపు నుంచి సభ్యుల ఇంటిబాట

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సహకార సంఘం చైర్మన్ లింగన్న, వైస్ చైర్మన్ రవీందర్ పై ఎనిమిది మంది సభ్యులు అవిశ్వాసానికి తెరలేపినప్పటికీ.. చివరకు ఉత్తదే అయ్యింది. సంఘంలో ప్రస్తుతం పదకొండు మంది సభ్యులు ఉండగా, అందులో చైర్మన్, వైస్‌చైర్మన్, మరో సభ్యుడు(ముగ్గురు) ఒకవైపు ఉండగా, మిగిలిన ఎనిమిది మంది సభ్యులు జత కట్టి, చైర్మన్, వైస్‌చైర్మన్ పై అవిశ్వాసం పెట్టేందుకు నిర్ణయించారు. వారంతా కలిసి ఈ నెల 19న రాత్రి రహస్య శిబిరానికి తరలివెళ్లారు. శిబిరానికి వెళ్లిన ఎనిమిది మందిలో నుంచి మంగళవారం ఒకరు బయటికి వచ్చారు. ఇక శిబిరంలో ఏడుగురు మాత్రమే మిగిలారు. దీంతో అవిశ్వాసం పెట్టే అవకాశం లేకుండా అయ్యింది. చివరికి అవిశ్వాస ప్రయత్నాలు అనుకూలించకపోవడం, పైగా క్యాంపులో ఉన్న అధికార పార్టీ సభ్యులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు ఫోన్ చేసి, అవిశ్వాస నిర్ణయాన్ని మానుకోవాలని పార్టీ కోసం అందరూ కలిసి ఉండాలని నచ్చజెప్పడంతో క్యాంపుకు వెళ్లిన వారంతా బుధవారం ఇంటిబాట పట్టారు. దీంతో అవిశ్వాస వివాదం చివరకు సద్దుమనిగింది.

పనుల పరిశీలన

కోటపల్లి: మండలంలోని మల్లంపేట ప్రాథమిక పాఠశాలలో 'మనఊరు–మనబడి' పనులను ఎంపీపీ మంత్రి సురేఖా పరిశీలించారు. మౌలిక వసతులను, చేపట్టాల్సిన పనులను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు.